ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 10.10.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన ప్రణాళికతో సిద్ధంగా ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.
2. రాష్ట్రంలో గత నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల జరిగిన పంట నష్టానికి పరిహారం కింద ప్రభుత్వం 79 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసింది.
3. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను అందజేసే కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ లో ప్రారంభించారు.
4. బతుకమ్మ సంబరాల ముగింపు సందర్భంగా ఈ సాయంత్రం ట్యాంక్ బండ్ పై ప్రభుత్వం పెద్ద ఎత్తున సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తోంది.

**ఖరీఫ్ ధాన్యం**

ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన ప్రణాళికతో సిద్ధంగా ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి, ధాన్యం కొనుగోళ్లపై మంత్రివర్గ సంఘం సభ్యుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పారదర్శకంగా, అక్రమాలకు తావివ్వకుండా ధాన్యం కొనుగోళ్లు చేపడతామని ఆయన చెప్పారు. సన్న రకం ధాన్యానికి ఈ ఖరీఫ్ నుంచే 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని, వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో సాగు చేసిన వరి ధాన్యం రకాలు, విస్తీర్ణంపై రాష్ట్ర వ్యవసాయశాఖ ఆన్లైన్ సిస్టమ్లో పొందుపరిచిందని వివరించారు. సన్నధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సన్నధాన్యం ఎత్తిన బస్తాలను ఎరుపురంగు దారంతో కుట్టాలని, దొడ్డు రకం ధాన్యాన్ని పచ్చదారంతో కుట్టాలని సూచించారు. కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఆర్డీవో నేతృత్వంలో కమిటీలు వేసినట్టు మంత్రి చెప్పారు. ఇ-కుబేర్ విధానంలో రైతులకు చెల్లింపులుంటాయని స్పష్టం చేశారు. ఖరీఫ్ ధాన్యం ఎగుమతుల కోసం విదేశాలు, ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు చెప్పారు.

(DESK)

**పరిహారం**

తెలంగాణలో భారీ వర్షాల వల్ల జరిగిన పంట నష్టానికి పరిహారం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో 28 జిల్లాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు నిర్ధారించారు. 79 వేల 574 ఎకరాలలో పంట నష్టానికి గాను 79 కోట్ల రూపాయల పరిహారం నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. పంట నష్ట పరిహారం కింద ఎకరానికి 10 వేల రూపాయల చొప్పున నేరుగా రైతు ఖాతాల్లో జమ అయ్యేలా అధికారులు ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

(DESK)

**పునరావాసం**

మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల జీవన స్థితిగతులు, ఆర్థిక ప్రమాణాలు మెరుగుపడేటట్టు పునరావాసం కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. హైదరాబాద్ నగరానికి ఆస్తిగా ఉన్న మూసీని డ్రయినేజీ కాలువగా వదిలేయబోమని మంత్రి స్పష్టం చేశారు. మూసీ పరివాహక ప్రాంతం ప్రజల్లో అపోహలను తొలగించేందుకు బస్తీల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు. మూసీ పరివాహక ప్రాంతానికి దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూముల్లో వారికి ఇళ్ళను నిర్మించి ఇస్తామని, అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసి వారి పిల్లలకు మెరుగైన విద్యను అందిస్తామని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి, వారి వ్యాపారాలపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మూసీ ప్రజల సమస్యలు వినేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలనీ, అపోహలు సృష్టించి ప్రజలను తప్పుతోవ పట్టించి, రాజకీయ లబ్ది పొందాలని చూస్తే హైదరాబాద్ నగరానికి నష్టం చేసిన వారవుతారని హెచ్చరించారు.

(DESK)

**రతన్ టాటా**

ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రతన్ టాటా మృతి పారిశ్రామిక రంగానికే కాకుండా యావత్ దేశానికి తీరని లోటని, ఆయనవ్యాపార రంగంలో నిబద్ధతకు, విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తిగానే కాకుండా, దాతృత్వానికి ప్రతీక అని ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు. టాటా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆయన ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో విశిష్ట సేవలు అందించారని ముఖ్యమంత్రి గుర్తు

చేశారు. రతన్ టాటా దేశ పారిశ్రామికాభివృద్ధికి చుక్కానిలా నిలిచిన మహనీయుడని కేంద్రమంత్రి కిషన్రెడ్డి నివాళులు అర్పించారు. దేశాభివృద్ధికి రతన్ టాటా ఎన్నో అవకాశాలు సృష్టించారని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. రతన్ టాటా ఎందరికో స్ఫూర్తిదాయకమని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం ప్రకటించారు. ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామికవేత్త రతన్ టాటా అని మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నివాళులు అర్పించారు. భారత వ్యాపార ముఖచిత్రాన్ని మార్చేసిన ఆయన, ఎంతోమందికి ప్రేరణ అని, టీహబ్ను చూసిన ప్రతిసారీ, ఆయనను గుర్తుంచుకుంటూనే ఉంటామని బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు తారక రామారావు అన్నారు. రతన్ టాటా భౌతిక కాయానికి మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఈ సాయంత్రం ముంబాయిలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

(DESK)

<u>గ్రూప్-1</u>

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల హాల్ టికెట్లను ఈనెల 14 నుంచి విడుదల చేయనున్నట్లు టిజిపి ఎస్సి తెలిపింది. టిజిపిఎస్సి వెబ్సైట్లో హాల్ టికెట్లను అందుబాటులో ఉంచుతారు. ఈనెల 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష హాల్లోకి మధ్యాహ్నం 12.30 గంటల నుంచే అభ్యర్థులను అనుమతించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రం గేట్లు మూసి వేస్తారు. మెయిన్స్ పరీక్షలు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తారు. మెయిన్స్ పరీక్షలో జనరల్ ఇంగ్లీష్ తప్ప మిగిలిన పేపర్లన్నీ అభ్యర్థులు ఎంచుకున్న భాషల్లో రాయాల్సి ఉంటుంది. గ్రూప్-1 మెయిన్స్లో మొత్తం ఆరు పేపర్లు ఉండనున్నాయి.

(DESK)

**<u>కరీంనగర్</u>**

కరీంనగర జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గీత కార్మికులకు లబ్ధిదారులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను అందజేశారు. ఈ కిట్ లో 1500 కిలోల బరువును మోసే మోపు ఉంటుంది, హైదరాబాద్ మినహాయించి రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల కిట్స్ ను గీతా కార్మికులకు పంపిణీ చేస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను రేపు ప్రారంభిస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హుస్నాబాద్, ధర్మపురి,

మానకొండూరులో 180 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటేడ్ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**PTC**

**<u>పీఎం విశ్వకర్మ</u>**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పీఎం విశ్వకర్మ పథకం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలుపై జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు పీఎం విశ్వకర్మ పథకం కింద 11500 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి తమ పంచాయతీ పరిధిలోని 18 రకాల కులవృత్తులు చేసే వారందరికి పీఎం విశ్వకర్మ పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీ సమగ్ర నివేదికను ఈనెల 20వ తేదీ లోగా అందజేయాలని కలెక్టర్ ను ఆదేశించారు.

(PTC)

**<u>బతుకమ్మ</u>**

రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నేడు చివరి రోజున సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సాయంత్రం ట్యాంక్ బండ్ పై 10 వేల మంది మహిళలతో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు. 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారు. ఈ సందర్భంగా, బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్క్ నుండి ప్రత్యేకంగా ఫైర్ వర్క్స్, లేజర్ షో ల ప్రదర్శన ఉంటుంది. ట్యాంక్బండ్పై బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

(PTC)

**<u>నవరాత్రులు</u>**

శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఈరోజు పలు చోట్ల అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ చేశారు.

జంటనగరాలతో సహా రాష్ట్రంలోని ప్రముఖ అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

(DESK)